క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగుల బదిలీలు

కందుకూరు: కందుకూరు ఎంపీడీఓ కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. పదేళ్లకు పైగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ అత్తావూర్ రెహ్మాన్ మొయినాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మొయినాబాద్ నుంచి సులోచన ఇక్కడికి రానున్నారు. ఎంపీఓ విజయలక్ష్మీ కొత్తూర్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో శంకర్‌పల్లి నుంచి గీత రానున్నారు. టైపిస్ట్ వెంకటేష్ కొత్తూర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఆమన్‌గల్లు నుంచి రాకేష్ వచ్చారు. ఆఫీస్ సబార్డినేట్ డి.దశరథ మహేశ్వరంకు బదిలీ కాగా అక్కడి నుంచే బాబు ఇక్కడికి రానున్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



ప్రారంభోత్సవంలో మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లోని శ్రీవిద్య టౌన్‌షిప్ ఫేస్–3లో సీసీ రోడ్డు, డ్రైనేజీలను సోమవారం మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ బిక్కునాయక్, కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి, సింహారెడ్డి, థామస్, అశోక్‌రెడ్డి, వెంకట్‌రావు, గోపాల్‌నాయక్, సోమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింహగౌడ్



మహేశ్వరం: బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మంఖాల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కొనమోని నర్సింహగౌడ్ సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలపై నిరంతరం పోరాడుతానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తుందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు నేరవేర్చకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. తనపై నమ్మకంతో ఈ పదవీని అప్పగించిన రాష్ట్ర, జిల్లా నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న 5 మంది ఉపాధ్యాయులను సోమవారం ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాల నుంచి ఉపాధ్యాయులు రామకృష్ణరావు, రాములు, వెంకటేశం, సుజాత, అరుంధతి అనే మందితో పాటు ఇక్కడే పదవీ విరమణ పొందిన యాదమ్మ అనే ఉపాధ్యాయురాలిని శాలువా, పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎక్కడున్న విద్యార్థులను వృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. బదిలీ అవుతున్న ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రఘునందన్‌రెడ్డి, అంజిరెడ్డి, జగదాంబ, సంధ్యశ్రీ, కుసుమకుమారి, శ్రీనివాస్, జంగయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలి

చేవెళ్ల: విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పలు వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చేవెళ్లలో ఎస్సీ కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తున్న అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో పైలం

- పొంచి ఉన్న కరెంటు ప్రమాదాలు
- నిర్లక్ష్యం చేస్తే అంతే సంగతులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



మన్సాన్‌పల్లి చౌరస్తాలో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్



మహేశ్వరం సబ్‌స్టేషన్

మహేశ్వరం: వానకాలం వచ్చిందంటే చాలు విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయి. ఏమాత్రం ఆదమరిచినా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో ప్రజలు, రైతులు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం విద్యుత్‌తో బోరుబావులు, కాల్వల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి పంటల సాగు చేస్తున్నారు. ఈ సమయంలో మోటార్ల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం బారిన పడకుండా ఉండొచ్చు. అలాగే అనుమతి లేని వ్యక్తులు ఫ్యూజులు, వీధి దీపాలు మార్చడం చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ తీగలు కిందకు వాలిన సమయంలో సిబ్బందికి సమాచారం అందించి వెంటనే సరిచేయించుకోవాలి. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు చిన్న చిన్న మరమ్మతులు చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాల్సి వస్తే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి.

జాగ్రత్తలు పాటించాలి



వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేయాలి లేకుంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే సొంతంగా మరమ్మతులు చేయకూడదు. సంబంధిత లైన్‌మెన్, సిబ్బందికి తెలియజేయాలి. ప్రతిఒక్కరూ విద్యుత్‌పట్ల జాగ్రత్తగా ఉండాలి.

– ఎం.చక్రపాణి, విద్యుత్ ఏఈ, మహేశ్వరం

చేయకూడని పనులు

- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకరాదు.
- నీటిలో పడిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లకూడదు.
- భవన నిర్మాణ పనులు చేసేటప్పుడు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలి.
- తడి చేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు. మరమ్మతులు చేయవద్దు.
- పిల్లలకు అందే ఎత్తులో స్విచ్ బోర్డులు ఉంచరాదు.
- స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మూత్ర విసర్జన చేయరాదు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటారుకు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి. ఎక్కువ దూరం ఉంటే గాలులు వీచినప్పుడు వాటి మధ్య ఉండే సర్వీస్ వైరు వదులై మోటారుపై ప్రభావం చూపుతుంది.
- మోటార్ పని చేయని సమయాల్లో చేతితో దానిని తాకకూడదు. టెస్టర్‌ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి.
- విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కరెంటు నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫ్యూజ్ బ్యాక్, స్టార్టర్ తప్పనిసరి ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీని దృష్టిలో ఉంచుకొని సరైన ఫ్యూజు వేయాలి. మోటారు వద్ద ఫ్యూజులు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను ఒక చెక్కపై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇనుప డబ్బాపై బిగించకూడదు.
- విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. పరిజ్ఞానం లేకుండా సొంతంగా మోటారును ముట్టుకోవద్దు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్

మహేశ్వరం: షరతుల్లేకుండా అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఏవిధంగా రుణమాఫీ చేశారో అదే విధంగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి షరతులు, నిబంధనలు లేకుండా మాఫీ చేయాలన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే ఒకే విడతలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు విడతల వారీగా చేయడం సరైంది కాదన్నారు. మండలంలో సుమారు 6,476 మంది రైతులు ఉండగా ఇటీవల విడుదల చేసిన రుణమాఫీలో మొదటి విడతలో 2,034 మందికి మాత్రమే లబ్ధి జరిగిందన్నారు. చాలా మంది రూ.లక్షలోపు రుణాలకు అర్హత ఉన్నా కొందరికే చేసిందన్నారు. మహేశ్వరం రైతు సహకార సంఘం నుంచి రుణమాఫీ కోసం 840 మంది రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపిస్తే అందులో 284 మందికి మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. మిగతా రైతులకు సైతం నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు కడమోని ప్రభాకర్, పోల్కం బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయాధికారి లావణ్య



కందుకూరు: అర్హులైన రైతులందరూ రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ లావణ్య సోమవారం ఓ ప్రకటనలో కోరారు. 2024 జులై 28 తేదీ వరకు పట్టాదారు పాస్ పుస్తకం పొంది, ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని పట్టాలు పొందిన అన్నదాతలు అర్హులన్నారు. ఆ రైతులు 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగి ఉండాలన్నారు. రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బీమాలో ఏవైనా మార్పులు చేర్పుల కోసం వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించాలన్నారు. కందుకూరు క్లస్టర్‌లో ఎల్.రాజు, మీర్‌ఖాన్‌పేట క్లస్టర్‌లో డి.రాఘవేందర్, రాచులూరు క్లస్టర్‌లో ఎ.సృజన, నేదునూరు క్లస్టర్‌లో టి.ప్రభావతి, గుమ్మడవెల్లి క్లస్టర్‌లో ఎ.అర్చన, పులిమామిడి క్లస్టర్ పరిధిలోని రైతులు జె.శ్రీహరిని సంప్రదించాలన్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతులు అన్ని దరఖాస్తులను వారికి అందించాలన్నారు.

కంపు భరించి.. గమ్యానికి చేరి



బస్‌షెల్టర్ సమీపంలో వెలువడుతున్న దుర్వాసనతో ప్రయాణికులు నిలబడలేని దుస్థితి మీర్‌పేట కార్పొరేషన్ పరిధి ప్రశాంతిహిల్స్ చౌరస్తాలో దాపురించింది. బస్‌షెల్టర్ వెనుక వైపు చెత్తను డంప్ చేస్తుండగా, వాటిని శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు ఎత్తకపోవడంతో పరిసరాలన్నీ దుర్గంధంతో అలుముకున్నాయి. దీనికి తోడు వర్షాలు కురుస్తుండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. శానిటేషన్ అధికారులు స్పందించి చెత్తను తరలించే ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – మీర్‌పేట:

ఆదర్శ బడులు తీర్చిదిద్దేందుకు కృషి

కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్ఆర్



మల్లాపూర్‌లోని పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న కేఎల్ఆర్

బడంగ్‌పేట్: చదువుంటే సంఘంలో వ్యక్తి తన సమస్యను తానే పరిష్కరించుకుంటాడని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. అందుకే ప్రభుత్వ బడులను సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతున్నామన్నారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేఎల్ఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడంగ్‌పేటలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చినప్పుడు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం రూ.98 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగానే కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఏఏ వసతులు కావాలో తెలుసుకుని వారం రోజుల్లో రిపోర్ట్ ఇవ్వడానికి తనతో పాటు మేయర్ పారిజాతరెడ్డిని నియమించారని తెలిపారు. ప్రతి పాఠశాలలో అదనంగా టాయిలెట్లు, స్కావెంజర్ల నియామకం, పాఠశాల పరిశుభ్రత చేసే ఆయాల నియామకం అవసరం ఉందని తేలిందన్నారు. మేయర్ పారిజాత మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో స్కావెంజరస్లు నియమించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో కౌన్సిల్ తీర్మానం చేసి రూ.25 లక్షల టెండర్లు పాస్ చేశామని అన్నారు. ఎవరూ రాకపోవడంతో ఆగిపోయినట్లు వెల్లడించారు. త్వరలో టెండర్‌లు పూర్తి చేసి పాఠశాలల్లో పరిశుభ్రత ఉండేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏంఈవో కృష్ణ, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 50, వంకాయ రూ. 23, బెండ రూ. 23, పచ్చిమిర్చి రూ. 45, కాకర రూ. 32, బీర రూ. 18, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 35, దొండ రూ. 28, చిక్కుడు రూ. 65, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 23, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 38, దోస రూ. 15, సొర రూ. 9, పొట్ల రూ. 8, ఉల్లిగడ్డ రూ. 34, చామగడ్డ రూ. 35.

రేణుశ్రీకి మెరుగైన వైద్యం అందించాలి

నాగోలు: కొత్తపేటలోని శ్రీచైతన్య కాలేజీ చదువుతున్న గిరిజన విద్యార్థిని రేణుశ్రీకి మెరుగైన వైద్యం అందించాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాంధీనాయక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని కాలేజీ గుర్తింపు రద్దు చేయాలన్నారు.

విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కార్యదర్శి షేక్ మహమూద్ డిమాండ్ చేశారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన బాల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన విద్యాశాఖకు బడ్జెట్‌లో 15 శాతం నిధుల కేటాయింపు హామీని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేయాలని అన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి తరగతుల వారీగా ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రతినిధులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శించారు. సమావేశంలో కృష్ణగౌడ్, శంకర్‌నాయక్, అంజయ్య, నర్సింగ్‌రావు, విజయ్, కిరణ్, సుకూర్ పాషా, అలివేలు, సంతోష, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్ పొందుతారని డాక్టర్ సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు దాత డాక్టర్ సురేశ్, నిర్మల దంపతుల సహకారంతో క్లాస్‌మెట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నగదు, ప్రశంసాపత్రం, మెడల్స్‌ను అందజేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటండి

తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్



మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్మన్ మధుమోహన్, కమిషనర్ వెంకట్రామ్

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని రావిర్యాలలో వన మహోత్సవంలో భాగంగా పండ్లు, పూల మొక్కలను కమిషనర్ వెంకట్రామ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలతో పండ్లు, పూలు, ఔషధాలు, కలప, స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. మొక్కలు పెంచి భవిష్యత్ తరాలకు భరోసా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరిరెడ్డి, ఏఈ భార్గవ్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు ప్రవీణ్‌రెడ్డి, నిరంజన్, బిల్ కలెక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి



కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి శివం హిల్స్‌కాలనీలోని పార్కు స్థలంలో రూ.2.90 లక్షలతో నూతన బోర్‌వెల్ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలనీల్లోని పార్కు స్థలాల్లో పార్కు స్థలమని బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్కు స్థలాలు కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారామ్, కాలనీవాసులు కృష్ణారెడ్డి, రత్నాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ముకుందరెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన పరికరాలు అందించాలి

నాగోలు: సెల్‌ఫోన్ వినియోగదారులకు నాణ్యమైన పరికరాలు అందించి వారి మన్ననలను పొందాలని దిల్‌సుఖ్‌నగర్ జోన్ మొబైల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షులు వంశీరాజ్ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం కొత్తపేట మారుతినగర్ కొత్తపేట మహిళా భవనంలో సోమవారం వంశీరాజ్ అధ్యక్షతన దిల్‌సుఖ్‌నగర్ జోన్ మొబైల్ షాప్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగ దారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంతో పాటు వస్తువుల యొక్క నాణ్యతను పాటించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ పరిధి ఆర్‌కేపురం డివిజన్, ఎన్టీఆర్‌నగర్ ఫేస్–3లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే సబితారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి పనులను వేగవంతం చేయాలన్నారు. ఎక్కడైనా అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోతే వెంటనే వాటిని ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా త్వరలో ప్రతిపాదనలు పెట్టి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు సంబంధిత అధికారులు సకాలంలో స్పందించాలన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఆక్రమణల కూల్చివేత



ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధిలోని బొమ్మలగుడి నుంచి స్వాతి రెసిడెన్సీ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను సోమవారం టౌన్‌ప్లానింగ్ సర్కిల్ అధికారులు కూల్చివేశారు. రోడ్డు ఆక్రమణలతో రహదారి ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని ఆదేశాలతో కూలివేతలు చేపట్టారు. సందర్భంగా టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ మన్సూర్ మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించి నిర్మాణం చేయరాదని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రోడ్డుపై ర్యాంపులను నిర్మించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది మహేందర్, పాషా, సాయి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నియమించాలని వినతి

కొందుర్గు: పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మా గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 330 మంది విద్యార్థులున్నారని, ఇదివరకు 16 మంది ఉపాధ్యాయులు పనిచేసేవారని తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఉపాధ్యాయులందరూ బదిలీపై వెళ్లారని, ప్రస్తుతం కేవలం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని వివరించారు. ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు.